క్లుప్తంగా

వర్గీకరణ పేరుతో మాలలకు అన్యాయం



ఏపీ శాసనమండలి చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న మాల ఉద్యోగుల సంఘ నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: ఎస్సీ వర్గీకరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మాలలకు అన్యాయం చేస్తోందని మాల ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు టి.అశోక్‌బాబు శనివారం ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజును కలిసి వినతిపత్రం అందించారు. ఒంగోలు ఎన్నెస్పీ అతిథి గృహంలో మోషేన్‌రాజును కలిసిన మాల ఉద్యోగుల సంఘ నాయకులు, మాల నాయకులు మాట్లాడుతూ సుప్రీం కోర్టు సూచనలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. జనాభా లెక్కలు నిర్వహించకుండా వర్గీకరణ చేయడం సుప్రీం కోర్టు తీర్పునకు వ్యతిరేకమన్నారు. కార్యక్రమంలో కె.ఏడుకొండలు, శ్యాంసన్, మల్లికార్జున్, టి.శ్రీకాంత్, ఎం.రవి, పి.మాల్యాద్రి, శాంతరాజు, బాలనారాయణ, వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

24లోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

- ప్రిన్సిపాల్ పి.ఉమామహేశ్వరి

ఒంగోలు సిటీ: 2025–26 సంవత్సరానికి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (బాలికలు) ఒంగోలులో మొదటి విడత ప్రవేశాలకు ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఫిట్టర్, సూయింగ్ టెక్నాలజీ (టైలరింగ్ ట్రేడ్స్)లో అడ్మిషన్‌కు ఆన్‌లైన్ ద్వారా అర్హులైన అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్ సైట్ ద్వారా ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ పి.ఉమామహేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రింట్ కాపీని డౌన్‌లోడ్ చేసుకొని దరఖాస్తు ఫారం, ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో జూన్ 2 నుంచి 10వ తేదీ లోపల కౌన్సెలింగ్‌కు ఒంగోలు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (బాలురు)లో హాజరుకావాలన్నారు. అడ్మిషన్ల సమయంలో అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తమ కార్యాలయంలో తప్పనిసరిగా అందజేయాలన్నారు. బాలురకు కూడా ప్రవేశం ఉందని చెప్పారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్లు 89777 11292, 77999 76888 ను సంప్రదించాలని కోరారు.

వైభవంగా లక్ష్మీచెన్నకేశవ స్వామి కల్యాణం

కొనకనమిట్ల: జై చెన్నకేశవా అంటూ మండలంలోని పెదారికట్ల గ్రామంలో శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి, పార్వతీ సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామికి అత్యంత భక్తిశ్రద్ధలతో కల్యాణం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య మంగళవాయిద్యాలతో స్వామివారికి తలంబ్రాలు పోశారు. కల్యాణ ఉభయదాతలుగా మద్దూరి, చెన్నారెడ్డి, చాగంరెడ్డి, గంగవరపు కుటుంబాలకు చెందిన దంపతులు వ్యవహరించారు. వేదపండితులు నంద్యాల వెంకటకృష్ణకిరణ్, నుదురుపాటి వెంకటకృష్ణారావు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి కల్యాణాన్ని జరిపించారు. కల్యాణాన్ని గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని తిలకించారు. అనంతరం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

అబద్ధాల హామీలిస్తే జగనే సీఎం

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు



వేదికపై మాట్లాడుతున్న చుండూరి రవిబాబు, పక్కన లంకపోతు అంజిరెడ్డి, కుప్పం ప్రసాద్, బొట్ల సుబ్బారావు

మోటుమాల (కొత్తపట్నం): గత సార్వత్రిక ఎన్నికల్లో అబద్ధాల హామీలిస్తే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎం అయ్యేవాడని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు అన్నారు. కొత్తపట్నం మండలంలోని మోటుమాల గ్రామంలో రెండు రోజుల నుంచి జరుగుతున్న సుబ్రహ్మణ్యస్వామి తిరునాళ్లలో వైఎస్సార్ సీపీ కొత్తపట్నం మండల అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ కుప్పం ప్రసాద్, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, తదితర నాయకులతో కలిసి శుక్రవారం అర్ధరాత్రి చుండూరి రవిబాబు పాల్గొన్నారు. ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామిని దర్శనం చేసుకుని పూజలు చేసి టెంకాయలు కొట్టారు. తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. వారిని ఆలయ నిర్వాహకులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై నిర్వహించిన కార్యక్రమానికి అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, మోటుమాల సర్పంచ్ కోడూరి గోపి అధ్యక్షత వహించారు. చుండూరి రవిబాబు మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల హామీలు నెరవేర్చకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పడంతో నిరుద్యోగులంతా ఓట్లు వేశారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఒక్కరికైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. అమ్మ ఒడి పథకం ఒక్క విద్యార్థికైనా అందిందా అని నిలదీశారు. పెద్దల పక్షం, కమీషన్లు ఇచ్చేవాడి పక్షం, వ్యాపారస్తుల పక్షం, పెట్టుబడుల పక్షంగా చంద్రబాబు వ్యవహరిస్తూ డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో పేదల పక్షం, రైతు కూలీల పక్షం నిలిచి వారికోసం కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమ పథకాలు అమలు చేశారని రవిబాబు గుర్తుచేశారు. జగనన్నకు పేదలన్నా, రైతులన్నా, సన్న, చిన్నకారులన్నా ఎంతో ప్రేమ అని, వారి కష్టాలు తెలుసుకుని పరిష్కారానికి పాటుపడే మనిషి అని కొనియాడారు. చంద్రబాబు తీరుతో ప్రస్తుతం రైతాంగం రోడ్డునపడే స్థితికి చేరుకుందన్నారు. మిర్చి, పొగాకు, కందులు, మినుములకు ధర లేదని, ఉప్పుకు గిట్టుబాటు ధర లేదని తెలిపారు. కందులు, అరిటికి కూడా మద్దతు ధర లేదన్నారు. వ్యాపారస్తుల దగ్గర కూటమి ప్రభుత్వం లంచాలు తీసుకోవడం వలనే రైతులకు గిట్టుబాటు ధర అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం ఎక్కువ రోజులు సాగదన్నారు. పేదలకు మళ్లీ పథకాలు అమలు కావాలన్నా.. పేదరికాన్ని నిర్మూలించాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి సీఎంను చేసుకోవాలని ప్రజలను కోరారు. లంకపోతు అంజిరెడ్డి మాట్లాడుతూ మండలంలో మోటుమాల గ్రామస్తులు మొదటి నుంచి వైఎస్సార్ సీపీవైపే ఉన్నారన్నారు. పార్టీకి ఈ గ్రామం కంచుకోటగా పేరుగాంచిందన్నారు. మోటుమాల గ్రామస్తుల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించామన్నారు. కుప్పం ప్రసాద్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ నాయకుడు ఐజాక్, లాయర్ శ్రీనివాసరావు, పార్టీ మోటుమాల గ్రామ అధ్యక్షుడు కోడూరి శ్రీనివాసరెడ్డి, శైలేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



మండల పరిషత్ సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు



సమావేశం నిర్వహిస్తున్న ఎంపీపీ విజయ, పక్కన ఎంపీడీవో సురేష్‌బాబు, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ

- మండలాన్ని అభివృద్ధి చేయాలి
- సంతనూతలపాడు మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ బుడంగుంట విజయ
- పలు సమస్యలు లేవనెత్తిన ప్రజాప్రతినిధులు
- హాజరుకాని పలు శాఖల మండల ఉన్నతాధికారులు
- హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకుంటామన్న ఎంపీడీవో సురేష్‌బాబు
- మండలంలో పేరుకుపోయిన సమస్యలపై జెడ్పీటీసీ దుంపా రమణమ్మ ధ్వజం

సంతనూతలపాడు: మండలంలోని గ్రామాల అభ్యున్నతికి అధికారులు, కార్యదర్శులు, సిబ్బంది ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని పని చేయాలని, మండలాన్ని అన్నివిధాలుగా ముందంజలో నిలపాలని ఎంపీపీ బుడంగుంట విజయ కోరారు. ప్రజాప్రతినిధుల విషయంలో అధికారులంతా ప్రొటోకాల్ పాటించాలని సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి ప్రసంగించారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలోని రెవెన్యూ, తదితర ప్రధాన శాఖల అధికారులు సమావేశానికి హాజరుకాకుండా కిందిస్థాయి ఉద్యోగులను పంపడంపై జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, లక్ష్మీపురం సర్పంచ్ రామానాయుడు, వైస్ ఎంపీపీ మండవ సులోచన, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాగైతే మండలంలో పేరుకుపోయిన సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రశ్నించారు. గ్రామాల్లో జరిగిన రీ సర్వేలో తప్పుల తడకలు ఉన్నాయని పలువురు ధ్వజమెత్తారు. రెవెన్యూ కార్యాలయ ప్రతినిధి సుధీర్ మాట్లాడుతుండగా, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు గగ్గోలు పెట్టారు.

ప్రధాన శాఖల మండల ఉన్నతాధికారులు హాజరయ్యేలా చూడాలి...

మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు రెవెన్యూ, తదితర ప్రధాన శాఖలకు చెందిన మండల ఉన్నతాధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని చిలకపాడు, తక్కెళ్లపాడు, సంతనూతలపాడు, తదితర గ్రామాల్లో హౌసింగ్ శాఖ పరిధిలో నిర్మించిన గృహాలకు సంబంధించి లబ్ధిదారులకు నేటికీ నిధులు విడుదల కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఎంపీపీ విజయ, చిలకపాడు సర్పంచి బొల్లినేని కోమలి సమావేశంలో లేవనెత్తారు. విద్య, వ్యవసాయం, ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీరాజ్, పశుసంవర్ధకశాఖ, ఐసీడీఎస్, ఉద్యానవనశాఖ, ఎస్ఎస్పీ, వైద్యారోగ్యశాఖ, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, వెలుగు, తదితర శాఖల అభ్యున్నతి గురించి ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు సమావేశంలో వివరించారు. మండలంలో ఆగిపోయిన పెన్షన్లను లబ్ధిదారులకు కేటాయించాలని జెడ్పీటీసీ దుంపా రమణమ్మ తెలిపారు.

హాజరుకాని అధికారులపై చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదికలు...

మండల పరిషత్ సమావేశానికి హాజరుకాని ఇరిగేషన్, సాంఘిక సంక్షేమశాఖ, విద్యుత్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులపై చర్యల నిమిత్తం ఎంపీపీ అనుమతితో ఆయా శాఖల ఉన్నతాధికారులకు నివేదికలు పంపించనున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. సమావేశాన్ని పర్యవేక్షించిన ఆయన.. పెండింగ్ పెన్షన్లపై విచారణ చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో వైస్ ఎంపీపీ తన్నీరు రాగమ్మ, ఏఈఓ ఎస్.వెంకటరావు, ఎన్ఎస్పీ జేఈలు రమణారెడ్డి, కరిముల్లా, పశువైద్యాధికారి ప్రతాపరెడ్డి, ఎంపీటీసీలు కే సుబ్బారావు, ఎల్.నాగేశ్వరరావు, ఎస్.రాధా, మెడికల్ ఆఫీసర్ శ్రావ్య, వెలుగు ఏపీఎం బాబూరావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వాసంతి, ఎంఈఓ వెంకారెడ్డి, మండల పరిషత్ ఏవో విజయలక్ష్మి, ఏఈలు వీరాంజనేయులు, మధుసూదన్‌రావు, గిరిప్రకాష్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆర్.ప్రసాద్, మహిళా ప్రాంగణ మేనేజర్ వై.అంజమ్మ, ఉద్యానవనశాఖ అధికారిని ప్రత్యూష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి, పార్వతీబాయ్, సర్పంచులు దర్శి నాగమణి, ఎం.శైలజ, ఓ బలరామిరెడ్డి, బొడ్డు రామారావు, డి.రమణ, బొలినేని కోమలి, గ్రామ సచివాలయాల కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

స్టడీ అవర్స్‌కు విద్యార్థులు డుమ్మా

- అయోమయంలో ఉపాధ్యాయులు

కొత్తపట్నం: పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన వారికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టడీ అవర్స్‌కు మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులు గైర్హాజరవుతుండటంతో ఉపాధ్యాయులకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఫెయిలైన విద్యార్థులను ఈ నెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్న సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. కానీ, మండలంలో ఫెయిలైన విద్యార్థులు వినియోగించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సబ్జెక్టుల ఉపాధ్యాయులు సంబంధిత విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసినా, ఇంటింటికి వెళ్లి స్టడీ అవర్స్‌కు రావాలని కోరినా ప్రయోజనం కనిపించడం లేదు. ఫెయిలైన సబ్జెక్టులు పూర్తిచేసుకుంటే మీ భవిష్యత్తు బాగుంటుందని చెబుతున్నప్పటికీ విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల్లో సైతం ఎలాంటి ఆసక్తి కనిపించడం లేదని ఉపాధ్యాయులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విద్యాశాఖ కమిషనర్ ఇచ్చిన టైం టేబుల్ ప్రకారం ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగున్నర గంటల వరకు సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు తప్పనిసరిగా పాఠశాలకు హాజరుకావాలి. పదో తరగతిలో ఫెయిలైన విద్యార్థులకు తరగతులు తీసుకోవాలి. మధ్యాహ్న భోజన పథకం కూడా అమలు చేయాలి. కానీ, క్షేత్రస్థాయిలో ఇదంతా జరగడం లేదు. దీనికి కారణం కేవలం విద్యార్థులు, తల్లిదండ్రుల్లో మార్పు కనిపించకపోవడమే అని తెలుస్తోంది. వారిలో ఏ విధంగా మార్పు తీసుకురావాలో అర్థంగాక ఉపాధ్యాయులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మరోవైపు జిల్లా అధికారులు పాఠశాలలను తనిఖీ చేస్తుండటం, విద్యార్థులు లేకపోతే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తుండటంతో ఉపాధ్యాయుల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యిలా మారింది. కనీసం పరీక్ష ఫీజు చెల్లించడానికి కూడా విద్యార్థులు, తల్లిదండ్రులు సుముఖత వ్యక్తం చేయడం లేదు. అన్ని పాఠశాలల్లో యాజమాన్య కమిటీలు ఉండగా, విద్యార్థులు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ఉపాధ్యాయులతో పాటు వారితో కూడా అధికారులు ప్రణాళిక సిద్ధంచేస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి



పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘ ప్రధాన కార్యదర్శి హనుమారెడ్డి

మద్దిపాడు: పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించి రైతులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మద్దిపాడు మండలంలోని వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వడ్డే హనుమారెడ్డి మాట్లాడుతూ పొగాకు రైతులు గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వ్యాపారులు సిండికేటై రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. పొగాకు పంట సాగుచేసిన రైతులు పెట్టుబడులు పెరిగిపోయి మధ్యస్తపు పొగాకు దిగుబడి రావడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. పొగాకు వేలం కేంద్రంలో నోబిడ్లు ఎక్కువై బేళ్లను తరలించడం చాలా ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. బోర్డు అధికారులు దాన్ని నివారించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. పొగాకు వ్యాపారులు రైతుల ఇబ్బందులను గమనించి అధిక ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ముండ్లమూరు క్లస్టర్‌కు చెందిన పొగాకు నాణ్యంగానే ఉందన్నారు. పొగాకు పంట దిగుబడి పెరగడం, అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ లేకపోవడం రైతులను కుదేలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో బ్యారన్‌కు 4 లక్షల రూపాయల నష్టం వాటిల్లుతోందన్నారు. పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టడం మంచిదన్నారు. పొగాకు పంట సాగుచేసిన రైతు అప్పుల బాధతో అల్లాడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అబ్బూరి శేషగిరిరావు, ఉమామహేశ్వరరావు, నారి పెద్ది వరహాలచౌదరి, బోయపాటి వెంకయ్య, జెజ్జర శరత్‌బాబు, నవ్వులూరి సురేంద్రమోహన్ తదితర రైతులు, రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.

పహల్గామ్ దాడికి నిరసనగా మానవహారం



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు

చీమకుర్తి: పహల్గామ్ దాడికి నిరసనగా చీమకుర్తి మున్సిపల్ పాలకవర్గం, అధికారులు శనివారం రాత్రి చీమకుర్తి బస్టాండ్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. తొలుత మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీగా కొవ్వొత్తులు, జాతీయ జెండాలు పట్టుకుని బస్టాండ్ సెంటర్‌కు చేరుకున్నారు. ఉగ్రవాదులు చేసిన దాడిని ఖండిస్తూ అమరులైన యాత్రికులకు నివాళులర్పించారు. దేశ సరిహద్దుల్లో దేశ రక్షణలో పాల్గొంటున్న సైనికులకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, కమిషనర్ వై.రామకృష్ణయ్య, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నా బిడ్డ భవిష్యత్తుకు భరోసా ఇవ్వండి



నా బిడ్డ భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ప్లకార్డు ప్రదర్శిస్తున్న గర్భిణి సీహెచ్ఓ



నిరసనలో పాల్గొన్న ఒక మహిళా సీహెచ్ఓల కుమార్తెలు సాధిక, యాషిక

- సీహెచ్ఓల సమ్మెలో గర్భంతో ఉన్న సీహెచ్ఓ వినూత్న నిరసన

ఒంగోలు టౌన్: ''ఏళ్ల తరబడి గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాను. సరైన భద్రత, రక్షణ లేకపోయినా తెగించి విధులు నిర్వహిస్తున్నాను. అయినా ప్రభుత్వం మా సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదు. గర్భిణిగా ఉన్న నేను నా బిడ్డ భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నాను. నాకు ఉద్యోగ భద్రత కల్పించాలి, నా బిడ్డ భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుకుంటున్నానంటూ'' సంతనూతలపాడు మండలం మద్దులూరు విలేజి క్లినిక్‌లో విధులు నిర్వహిస్తున్న గర్భిణి అనూష వినూత్నంగా నిరసన తెలిపారు. నా బిడ్డ భవిష్యత్తుకు భరోసా ఇవ్వండంటూ కలెక్టర్ కార్యాలయం వద్ద సీహెచ్ఓల దీక్షా శిబిరం వద్ద శనివారం ప్లకార్డు ప్రదర్శించడం అందరినీ ఆలోచన రేకెత్తించింది. అలాగే మరో సీహెచ్ఓ ప్రసన్న కుమార్తెలు సాధిక, యాషికలు నిరసనలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ''అమ్మ ఉద్యోగం అటు..మా భవిష్యత్తు ఎటు'' అనే ప్లకార్డును ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్లు దాటిన సీహెచ్ఓలను క్రమబద్ధీకరించాలని, ఎన్‌హెచ్ఎంలతో సమానంగా 23 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ నిరసనలో ఏపీహెచ్ఎంసీఏ నాయకులు పాల్గొన్నారు.


భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యస్వామి తిరునాళ్లు



నెమలి వాహనంపై గ్రామోత్సవంలో స్వామివారు



విద్యుత్ దీపాలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయం



ఆలయంలో ప్రత్యేక అలంకరణలో పూజలందుకుంటున్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

కొత్తపట్నం: శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండలంలోని మోటుమాల గ్రామంలో శుక్రవారం రాత్రి తిరునాళ్లను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడోరోజు సుబ్రహ్మణ్యస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. స్వామివారిని దర్శనం చేసుకున్నారు. స్వామివారికి నిత్యార్చన, నిత్యహోమం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో మొదటిసారి సుబ్రహ్మణ్యస్వామి తిరునాళ్లు నిర్వహించడంతో అధిక సంఖ్యలో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. శనివారం నెమలి వాహనంపై సుబ్రహ్మణ్యస్వామిని అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం దగ్గర నుంచి బస్టాండ్ సెంటర్, పోతులూరి వీరబ్రహ్మం ఆలయం మీదుగా గ్రామం మొత్తం ఊరేగించారు. భక్తులు సుబ్రహ్మణ్యస్వామికి టెంకాయలు కొట్టి కాయలు, పండ్లు సమర్పించి హారతులిచ్చారు. హైదరాబాద్ వారిచే డ్యాన్స్ బేబీ డ్యాన్స్ నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మోటుమాల గ్రామస్తులు, శ్రీ జంట నాగేంద్రస్వామి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ లీలలపై ఆధ్యాత్మిక ఉపన్యాసం



అగస్త్యరాజు శివను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: స్థానిక లాయరుపేట వీఐపీ రోడ్డులో జాతీయ పద్యసారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమంలో శనివారం రెండోరోజు సాయత్రం ఏడు గంటలకు భాగవత దశమ స్కంధంలోని శ్రీకృష్ణలీలలు అనే అంశంపై ఆధ్యాత్మిక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. జ్యోతిష్య, వాస్తు సిద్ధాంతి, ఆధ్యాత్మిక ప్రవచకులు అగస్త్యరాజు శివ పాల్గొని ఉపన్యాసం అందించారు. శ్రీకృష్ణ జననం, బాలకృష్ణుని లీలలు, శ్రీకృష్ణ అవతార పరమార్థం, తనను నమ్మిన వారిని శ్రీకృష్ణుడు ఎలా వెన్నంటి కాపాడతాడనే విషయాలను సోదాహరణంగా పోతన విరచిత భాగవత పద్య సహితంగా ఆయన వివరించారు. అనంతరం పరిషత్ గౌరవాధ్యక్షుడు చదలవాడ నరసింహారావు, అధ్యక్షుడు మాగంటి శ్రీరామమూర్తి, కార్యదర్శి పింగళి పూర్ణచంద్రరావు, కమిటీ సభ్యులు కలిసి అగస్త్యరాజు శివను సత్కరించారు.

కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలు

కొమరోలు: కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని గోనపల్లె, మదవపల్లె గ్రామాల మధ్యలో శనివారం చోటు చేసుకుంది. ద్విచక్ర వాహనాన్ని కారు వేగంగా ఎదురుగా ఢీకొనడంతో కోనపల్లె గ్రామానికి చెందిన చెన్నయ్య, వెంకట సుబ్బయ్యకు గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో గిద్దలూరు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఎస్సై సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు ఆగకుండా వేగంగా వెళ్లిపోయింది.

శాస్త్రోక్తంగా అరుణ పారాయణం

ఒంగోలు మెట్రో: జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకల్లో భాగంగా శనివారం రెండోరోజు ఒంగోలు వేదస్మార్త ప్రవర్తక విద్వత్ పరీక్షా పరిషత్ ఆధ్వర్యంలో ఉదయం ఎనిమిది గంటలకు కేశవస్వామిపేటలోని లలితాశ్రమంలో అరుణ పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద విద్యార్థులు, పురోహితులు, ప్రముఖ వేద పండితులు వంగల కృష్ణమూర్తి అవధాని, పిన్నెల్లి చంద్రశేఖర్ అవధాని, నేలబొట్ల సదాశివయ్య, జ్యోతిష వాస్తు సిద్ధాంతి వేదశిష్ల వెంకట సుబ్రహ్మణ్యం శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొని మాట్లాడారు. వేద సభలు నిర్వహిస్తున్న వేద పండితులను, లలితాశ్రమ మాతాజీని, నిర్వాహకులను, వేద విద్యా పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించారు. అనంతరం వేద విద్య పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు వేద పండితులు సర్టిఫికెట్లు అందించి శాలువాలతో సన్మానించారు. భక్తులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు నేలబొట్ల సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షుడు గుడ్లదొన మురళీకృష్ణ, కార్యదర్శి మహంకాళి శేషయ్య, జాయింట్ సెక్రటరీ భీమశంకరశాస్త్రి, కోశాధికారి తొండపి మల్లినాథుడు, సభ్యులు, ప్రముఖ జ్యోతిష్య వాస్తు సిద్ధాంతి వేదశిష్ల వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, అలూరి రామారావు, భారతుల శ్రీనివాసశాస్త్రి, మైనంపాటి సాయికుమార్, ఓరుగంటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

ఒంగోలు మెట్రో: స్థానిక మంగమూరు రోడ్డులోని అచలానందాశ్రమంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన, కళ్యాణ మహోత్సవాలను ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకుడు శ్రీ పరిపూర్ణ సిద్ధానందస్వామి తెలిపారు. ఆరాధన మహోత్సవాల వివరాలను శనివారం ఆయన వెల్లడించారు. భక్తులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.